**కన్నబిడ్డకు స్తన్యమిచ్చే అనుభవం, జంతువులకు కూడా పారవశ్యాన్నీ మాతృగర్వాన్నీ యిచ్చేటంత గొప్పది! అటువంటి అనుభవాన్ని పొందడానికి 'దొంగ' అనిపించుకోవలసివస్తే ఆ తల్లి మనసు యేమవుతుంది?**

# పాలు

## ఆకెళ్ళ నాగలక్ష్మి



అది హైదరాబాదులో నవాబుల పరిపాలన కాలంలో కట్టిన పెద్ద భవనం.

ఆ రోజుల్లో అక్కడ మూడెకరాల వైశాల్యం ఉన్న స్థలంలో కాంపౌండు గోడ మధ్య ఆ బిల్డింగ్ ఒక్కటే ఉండేది. అంతా ఒకే యజమాని ఉండేవాడు.

ఇప్పుడు ఆ కాంపౌండు నానుకొని చుట్టూ చిన్న సైజు ఇళ్ళు కాంపౌండు లోపల లేచిపోయాయి. ఆ పెద్ద భవనం ఎనిమిది వాటాలుగా పంచుకోబడింది. వాటిలో ఉంటూన్న వాళ్ళందరూ పెద్ద ఉద్యోగస్థులూ, వ్యాపారస్థులూను. అందులో కొందరు యజమానులు, కొందరు అద్దెకుంటూన్నవాళ్ళు. కాంపౌండు నానుకొని చుటూ వున్న ఇళ్ళల్లో కూడా కొందరు యజమానులు, మరికొందరు అద్దెకుంటూన్న చిన్న చిన్న ఉద్యోగస్థులు. ఒక మూలకు వున్న రెండు చిన్న రేకు షెడ్లల్లో రెండు నిరుపేద కుటుంబాలు కూడా వున్నాయి.

మొత్తానికి అదో చిన్న ప్రపంచం.

ఆ భవనంలో ఎదురుగా కనబడేపధ్య వాటా అన్నింటికంటే పెద్దది. అందులో మూడు బెడ్‌రూమ్‌లు, ఒక డ్రాయింగ్, ఒక డైనింగు, ఒక కిచెన్ అన్నీ వ్యవహరించబడే మొత్తం ఆరు విశాలమైన గదులు, ముందు భాగంలో పెద్ద హాలులా కనబడే వరండా వున్నాయి అందులో వుండేది ఆ కాంపౌండు మొత్తానికి చిన్నదైన పురుషోత్తమరావు కుటుంబం. పురుషోత్తమరావు రెండు మూడు పెద్దకంపెనీల ఏజన్సీలు తీసుకొని ఆఫీసు ఇల్లు అందులోనే పెట్టుకొని వ్యాపారం సాగిస్తున్నాడు. అతని ఏజెన్సీలలో ముఖ్యమైనది పాల డబ్బాల అమ్మకం. ఏ వ్యాపారస్థుడి సరుకు వాడి వాడకానికి సరిపోదనేది అక్షరాలా నిజమైంది పురుషోత్తం విషయంలో. నడివయసులో ఉన్న పురుషోత్తం భార్య జగదాంబకు అరడజను కాన్పులయ్యాయి కాని ఆరునెలలు దాటి ఏ పసిగుడ్డూ నిలవలేదు.

ఆ కాంపౌండ్‌లో అన్నింటికంటే చిన్న రేకుల షెడ్డులో ఉంటూన్న యాదగిరి కుటుంబం అన్నింటికంటె పెద్దది. యాదగిరి చార్మినార్ దగ్గరున్న ఒక ఇనుప బీరువాల తయారీ కంపెనీలో సామాన్లు మోసేందుకు రోజు కూలీ పని చేస్తాడు. అతని భార్య సీతకు ముప్పైమూడేళ్ళ వయసుంటుంది. పచ్చగా, అందంగా, ఆరోగ్యంగా ఉంటుంది. సీతకు ఆరుగురు పిల్లలు. మొదటిది అమ్మాయి, మిగిలిన వాళ్ళు మగపిల్లలు. అమ్మాయికి పెళ్ళయిపోయింది. అమ్మలాగ పదహారేళ్ళ వయసుకే అత్తారింటికెళ్ళి కాపురం చేసుకుంటూంది. సీతకు అమ్మాయి పుట్టిన మూడు నాలుగేళ్ళు పిల్లలు పుట్టలేదు కాని తరువాత రెండేళ్ళ కొకడు వరస తప్పకుండా పుట్టేస్తున్నారు. ఆఖరు పిల్లవాడికిప్పుడు మూడో నెల. ఆ కాంపౌండు లోనే చిక్కినన్ని ఇళ్ళల్లో చాకిరీ చేసి గడియారం ముల్లులా కాలం నెట్టుకొస్తూంది సీత. దిక్కులేని వారికి దేముడే దిక్కన్నట్టు సీత పిల్లలకు తల్లి నాలుగిళ్ళల్లో గిన్నెలు తోమి తెచ్చే ఎంగిలి తిండి తిని జీర్ణం చేసుకొనే శక్తి వచ్చే వరకూ తల్లిపాలే ఆకలి తీరుస్తున్నాయి.

ఎన్నో సంవత్సరాల తన చాకిరీ మధ్య ఎప్పుడయినా సీతకి ఓ క్షణం తీరిక దొరికితే తన షెడ్డు ముందు కూర్చొని ఆఖరుపిల్లవాడు పాలు తాగేక వాడిపై వాడి పాత అలవాటును ఓసారి గుర్తు చేసుకొని తల్లి రొమ్ముని పాలు కుడుపుతుండడం చాలా పరిపాటిగా వచ్చే దృశ్యమే.

జగదాంబకు మళ్ళీ పురిటి రోజులు.

గర్భిణీగా ఉండగా పుణ్యగాథలు వింటే ఆ ఫలితం వల్లనైనా పిండం నిలుస్తుందనే ఆశతో ప్రతి శనివారం పురాణం చెప్పే పంతులు ఆ కాంపౌండులో ఉంటే అక్కడికే వెళ్ళి కూర్చునేది జగదాంబ. ఈ వారం మరీ కదిలే ఓపిక లేక పంతులునే తమ వరండాలో కొచ్చి చెప్పమని అడిగింది. ఆ రోజు సగం కథ అయేక సీత కూడా తన పనులు పూర్తయి చంటివాణ్ణి చంకనేసుకొని వెనకాల మరో ఇద్దరు

పిల్లలు కొంగు పట్టుకొని రాగా వరండా క్రింద గుమ్మాలమీద చతికిలబడింది.

పంతులు పురాణం మధ్య అప్పుడే ఏదో కథ ఎత్తుకున్నాడు....పూర్వం ఒక అడవిలో ఓ ఆశ్రమం ఉండేదిట. ఆ ఆశ్రమంలో ఓ బ్రహ్మచారి పుట్టినప్పటినుంచీ అక్కడే వుండి గురువు దగ్గర అన్ని విద్యలూ అభ్యసించి పరిపూర్ణుడయ్యేడట. కాని అతనికి విద్య పూర్తయేసరికి ఉన్న లోపమలా ముని ఆశ్రమం తప్ప మరో ప్రపంచం తెలియకపోవడం. అందుచేత విద్య పూర్తయిన రోజు గురువుగారు అతన్ని పిలిచి అతనికి లౌకికానుభవం తెలియజెప్పాలనే ఉద్దేశ్యంతో దగ్గరలో వున్న పల్లెకువెళ్ళి ఆశ్రమవాసులకు భిక్ష తీసుకొని రమ్మన్నాడట. సరేనని ఆ బ్రహ్మచారి వూరికి వెళ్ళి మొదటి ఇంటి తలుపు తట్టేడుట. తొమ్మిదేళ్ళ అమ్మాయి తలుపుతీసి భిక్ష వెయ్యడానికి వచ్చిందట. అప్పటివరకూ అమ్మాయినే చూడని ఆ బ్రహ్మచారి ఆ పాపను చూస్తూనే ఆశ్చర్యపోయి భిక్ష తీసుకోకుండా ఆమెను గురించి మనసులో కలిగిన సందేహాన్ని ప్రశ్నగా అడిగేడుట. ఆ అమ్మాయి బిత్తరపోయి లోపలకు వెళ్ళి వాళ్ళమ్మను పిలుచుకొచ్చిందట. నడివయసులో వున్న వాళ్ళమ్మను చూసి బ్రహ్మచారి మరీ ఆశ్చర్యపోయి ప్రశ్నల వర్షం కురిపించేడుట. ఆశ్రమం నుంచి ఆరోజే మొదటి సారి బయటకు వచ్చేడని తెలుసుకొని ఆ తల్లి అతని సందేహాలను సహృదయతతో అర్థం చేసుకొని జవాబులు చెప్పసాగిందట!" మీరు ఎందుకింత భిన్నంగా, ఆకర్షణీయంగా కనబడుతున్నారు?" అన్నది అతడి మొదటి ప్రశ్న. 'సృష్టి కొనసాగడానికి స్త్రీ పురుషులు కావాలి ' నువ్వు ఇప్పటిదాకా పురుషులనే చూశావు. నేను స్త్రీని. పురుషుణ్ణి ఆకర్షించి సృషి వ్యాపారం కొనసాగించడానికి నాకీ ఆకర్షణ దేవుడు ప్రసాదించాడు" అని ఆమె జవాబు చెప్పింది. "మీ కంఠం ఎందుకింత శ్రావ్యంగా ఉంది?" అన్నది రెండో ప్రశ్న. "పిల్లలని ప్రేమతో లాలించి బుజ్జగించి పెంచాలి నేను. అందుకు నాకు అనువుగా ఉండడానికి శ్రావ్యమైన కంఠం దేవుడు ప్రసాదించాడు" అందామె. అప్పుడా బ్రహ్మచారి ఆమె స్తనాలవైపు చూపించి అవి ఏమిటి? అని అడిగేడుట. అవి స్త్రీ కనబోయే సంతానానికి దేవుడు ముందుగా ఏర్పరచిన ఆహారాన్ని అందించే సాధనం అని జవాబు చెప్పిందట....!

"దొంగ! దొంగ!" అని కేకలు వేసే


# HORSLEY HILLS SCHOOL

*Horsley Hills (PO). Chittoor Dt. (AP)*

This School is affiliated to the Council for Indian School Certificate Examination, New Delhi. It is an English Medium Residential School run on Public School lines for Boys and Girls.

There will be few admission to Class I to VI for the Academic year 1979.

For particulars please Contact :—

PRINCIPAL

## ఋణం

వ్యాపారాభివృద్ధి కోసం ఆకర్షణీయమైన షరతుల మీద భవనం, వ్యాపారం, షాపులు, భూములు, థియేటర్లు, లిమిటెడ్ కంపెనీలు, పరిశ్రమలు వగైరాలపై రు. 20,000 లేక ఆపైన ఋణం లభించును.

వ్రాయండి లేదా సంప్రతించండి. ఫోన్ : 395126

SUPREME CORPORATION (BANKERS)

F-15 "EVEREST" 7th Floor, Near Famous cine laboratory, Tredeo Road, BOMBAY-400 034

ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులో

చక్కటి అవకాశం ది 1-12-78 నుండి ప్రారంభమవుతుంది

రు. 15000 ల

VIMAL

A RELIANCE PRODUCT

విలువైన 400 ల బహుమతులు

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన విమల్ వస్త్రములను ధరించండి.

మీ హుందాకు తగినవి అందమైనవి రకరకాల

రంగుల వైభవం వెల్లివిరిసే

ఆరాధన షో రూంలో

నేడే 50 రూపాయలకు విమల్ వస్త్రములను

ఖరీదు చేసి బహుమతి కూపను పొందండి

ఆరాధన విమల్ షో రూం కొత్తగూడెం.



విజయవాడ ఆలిండియా రేడియో "బాలల దినోత్సవం" సందర్భంగా తెనాలిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో "త్రపు-పులి" నృత్య నాటికలో దృశ్యం

టప్పటికి వరండాలో పురాణ కాలక్షేపం చెదిరిపోయింది.

ఆ భవనం వెనకవైపు ఉన్న వంటింట్లోకి చొరబడ్డ ఓ పదహారేళ్ళ కుర్రవాడిని పట్టుకొని భవనం ముందు కీడ్చుకొచ్చేరు. వాడి చుట్టూ కాంపౌండులో జనం అందరూ మూగిపోయారు. రాత్రి తినగా మిగిలింది గిన్నెల్లో ఉంటే వాడు తినేస్తున్నాడుట. గిన్నెలు చప్పుడైతే ఇల్లాలు అరిచింది. ఇంటాయన పట్టుకున్నాడు అంతరిమధ్యా చేతికొచ్చినట్టు కొట్టాడు. వాడి ముక్కులోంచీ, నోట్లోంచీ రక్తం వస్తూంది.

కొటినన్ని కొటి, ఇంకా కొడితే చచ్చిపోతాడని భయపడి రోడ్డు చివరివరకూ తరిమి వదిలేశారు.

సీత కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరిగాయి వాడిని చూడగానే:రాత్రి నిద్రపట్టక ఇటూ, అటూ దొర్లి పంతులు చెప్పిన కథనే గుర్తుకు చేసుకుంటూంది.

పిల్లల కోసం తల్లి రొమ్ముల్లో దేవుడు ఆహారం పెట్టినట్లే మనిషి బ్రతికి నన్నాళ్ళూ ఆహారం ఇచ్చేసే ఎంత బాగుండును? పోనీ చల్లగా ఉండు దేవుడా! నా పిల్లలందరికీ కడుపునిండుగా నా గుండె నిండా పాలు నింపినావు! అంతే చాలు! సీత మనసులో సంతృప్తి నిండింది. సరిగా ఆ రాత్రి జగదాంబ కూడా ఆ విషయం గురించే ఆలోచిస్తూ పడుకుంది.

తనకు ఇన్ని కానుపులయినా ఒక్కసారి కూడా పిల్లలకు ఒక్క పాలచుక్క తన దగ్గర నుంచి ఇవ్వలేకపోయింది. పోతపాలే వాళ్ళకి గతి అయ్యేయి. అయితే దేవుడు వాళ్ళకు ఆయుష్షు లేదనే పాలు తన రొమ్ముల్లో నింపలేదా? కలిగిన మనస్సుతో కలత నిద్రపోయింది జగదాంబ. మరో నెలకు జగదాంబకు పురుడొచ్చింది. రావలసిన రోజు కంటె నెల రోజులు ముందొచ్చేసింది. పిల్లవాడు ఎలుక పిల్లలా వున్నాడు. మూడు రోజులు ఇంక్యుబేటరులోపెట్టి చివరకు ప్రమాదం లేదని పసిగుడ్డును జగదాంబ పక్కలో పడుకోబెట్టేరు ఈసారి కూడా తనకు పాలచుక్క లేకపోయేసరికి జగదాంబ గుండె ఝల్లుమంది.

మనసులో ఆందోళన ఆపుకోలేక మరో నాలుగు రోజులకు డాకరును సలహా అడిగింది. డాక్టరు ఫరవాలేదని చెప్తూ ఆరోగ్యంగా వున్న ఏ తల్లిచేతనైనా పాలిప్పించినా మంచిదేనని చెప్పాడు. ఆ రోజు నుంచి జగదాంబ కళ్ళు సీతమీద పడ్డాయి.

ముక్కూ, నోరూ ఏకం చేసుకొని ఏడుస్తూ దుమ్ములో పాకివస్తూన్న పిల్లాణ్ణి తీసుకొని పైట కొంగుతో వాడిముక్కు తుడిచి ఏ గుమ్మం మెట్లమీదో వాడిని అడ్డం వేసుకొని కూర్చొనే సీతను, పుష్టిగా పచ్చని నరాలతో మాతృత్వంతో పొంగిన రొమ్మును పిల్లవాడి నోట్లోపెట్టి వాడి జుట్టును వేళ్ళతో ఆప్యాయంగా సవరిస్తూన్న సీతను రెప్పవాల్చకుండా చూసేది.

పని మనిషిని చేత పాలిప్పించడమా అని రెండు మూడు రోజులు సందేహించింది.

సీత పిల్లలూ, సీత మొగుడూ ఆమె చుట్టూ పరిసరాలూ మురికిగానే ఉన్నా సీత పసిమి ఛాయవలననో, ఆమె అందం వలననో, ఆరోగ్యం వలననో, లేదా అందరిళ్ళల్లోకి అన్ని గదుల్లోకి వెళ్ళి పనులు చేసి వస్తూండటంవలననో సీతమాత్రం శుభ్రంగానే వున్నట్లు అనిపించింది జగదాంబకు.

మరో రెండు మూడు రోజులకు జగదాంబ మనసు సమాధానపడిపోయింది. చివరకు సీతను అడిగింది. కాని షరతేమంటే సీత తన పిల్లవాడికి పాలివ్వకూడదు

"నా బిడ్డను పాలు చీకనియ్యకుండా నేనొక్క రోజు బతగ్గలనా?" సీత ఒక్క మాటలో తోసిపారేసింది జగదాంబ తన మాటలు పూర్తి చెయ్యకుండానే. "మీ వాడికి డబ్బా పాలు పొయ్యి సీతా! ఎన్ని డబ్బాలయితే అన్నీ నేను ఇస్తాను." అంది జగదాంబ.

"నేనింత బలంగా వుండి ఆడికి డబ్బా పాలెట్టా పొయ్యనమ్మా?" అంది సీత.

"పైన నెలకు ఓ ముప్పై రూపాయలిస్తాను" అంది జగదాంబ.

"నా చేత కాదమ్మా" సీత వెళ్ళిపోయింది.

ఆ తర్వాత మళ్ళీ ఆ మాట నోరు విడిచి స్పష్టంగా అడగలేదు.

ఓ పూట సీతను పిలిచి కాసేపు కూర్చోపెట్టి చిక్కటి కాఫీ ఇచ్చి చక్కగా మాట్లాడింది జగదాంబ.

ఆ మర్నాడు సీతకు పాతది చిరిగిపోయిన పట్టుచీర ఒకటి ఇచ్చి కట్టుకోమంది జగదాంబ.

ఆ రాత్రి పట్టుచీరలో సీతను చూసిన యాదగిరి సీత కాపురాని కొచ్చిన మొదటి రాత్రి చూపించినంత సంబరం చూపించి రాత్రి సరిగా నిద్రపోనియ్యలేదు. నిద్రపోయేముందు జగదాంబ కొడుకు గుర్తుకొచ్చి సీత మనసు కలుక్కుమంది.

మరోరోజు పురుషోత్తమరావు స్నేహితులకి చిన్నపార్టీ ఇస్తే మిగిలిపోయిన తినుబండారాలు జగదాంబ సీతను పిలిచి ఆమె పిల్లలకు పెట్టమని ఇచ్చింది పిలలు లొట్టలేసుకుంటూ తింటూంటే జగదాంబ కొడుకు గుర్తుకొచ్చి సీత మనసు బాధపడింది. ఆ రోజే జగదాంబ సీతను పిలిచి ఏదో మాటల సందర్భంలో తన పిల్లవాడి ఆరోగ్యం సరిగా వుండటంలేదనీ వాడయినా తనకు దక్కుతాడో. లేదోననీ కంట తడి పెట్టుకుంది.

ఇంకోరోజు జగదాంబ తన భర్త చొక్కాలు చిరిగిపోయినవి రెండు యాదగిరికి ఇయ్యమంటూ ఇచ్చింది. రోజు రోజుకు సీతకు జగదాంబ కొడుకు ఆరోగ్యం ఒక చెప్పలేని మనోవ్యధ అయిపోయింది. జగదాంబ కష్టంపట్ల ఆమె మనసు కరిగింది. ఆమె తన కింతసాయం చేస్తున్నా తానేమీ చేయలేకపోతున్నానని మధనపడింది. ఒకరోజు "నా దగ్గర పాలు ఇద్దరికీ సరిపోతాయి ఇస్తానమ్మా! అంది

కాని జగదాంబ ఒప్పుకోలేదు. అలా చేస్తే తెలియని రోగాలొస్తాయనీ ఎవరికొచ్చినా కష్టమేననీ చెప్పి "నీ పిల్లాడు ఆరోగ్యంగానే ఉన్నాడు కనుక డబ్బా పాలు పట్టించమంది. సీత ఏ మాటా చెప్పలేకపోయింది. ఆ పగలూ, రాత్రీ ఆమెకు ప్రతిక్షణమూ ఇదే ఆలోచన అయిపోయింది. అదీగాక పిల్లవాడి పాల డబ్బాలుకాక జగదాంబ పైన ఇస్తానన్న ముప్ఫైరూపాయలు తనకు మరో రెండిళ్ళు చేసేవరకూ రావు. ఇప్పుడున్న టైములో తను చేసే ఇళ్ళకంటె ఎక్కువ చెయ్యలేదు. పిల్లలు పేరుకు పిల్లలయినా తిండికి పెద్ద వాళ్ళలాగే తింటున్నారు. తను రెక్కలు ముక్కలు చేసుకు చేసినా మొగుడు సంపాదించి తాగగా మిగిలిన దానితోటీ, తాను తెచ్చిన దానితోటీ ఏదో తెల్లారుతుంది. చీకటి పడుతూంది. కాని రేపు తలచుకుంటే భయంగానే వుంది. కనీసం ఆ ముప్ఫై రూపాయలైనా వెనకేసుకుంటే ఎప్పుడే అవసరం వచ్చినా పనికొస్తుంది అనిపించింది ఆ ఆలోచన నిముష నిముషానికీ ఎక్కువయిపోయి ఆమె మనసు మనసులో నిలువలేదు.

మళ్ళీ తెల్లవారగానే జగదాంబ దగ్గరకు సీత తనంతతానే వెళ్ళి చెప్పింది ఆమె పిల్లవాడికి పాలిస్తానని.

"వీడికి పాలిచ్చేనన్నాళ్ళు మీ పిల్లవాడికి పాలివ్వకూడదు. నీకలా ఇష్టం అయితేనే చెప్పు!" అంది జగదాంబ ఖండితంగా. "అలాగేనమ్మా!" అంది సీత బిక్కచచ్చిపోయి అనుమానంగా. "ఈ పేళ బాగా ఆలోచించుకొని రేపు చెప్పు!" అని జగదాంబ తనకీ విషయం అంతగా పట్టనట్లే తన పనిలో తాను మునిగిపోయింది.

సీత మనసులో పూర్తిగా సిద్ధపడిపోయింది. కాని జగదాంబ మర్నాడు చెప్పమంది. తెల్లారే లోపల ఆమె ఎక్కడ మనసు మార్చుకుంటుందోననె భయపడిపోయింది సీత.

సాయంత్రం జగదాంబ బజారు కెడుతూంటే సీత గుమ్మం ముందు నిలబడింది ఆమె ఏమయినా పలకరిస్తుందోనని. ఆమె మాట్లాడకుండా వెళ్ళిపోయింది.

ఎలాగో మళ్ళీ ఆ రోజంతా క్షణమొక యుగంలా గడిపి తెల్లారగానే సీత జగదాంబ దగ్గరకెళ్ళింది. ఎందుకో మనసులో ఆమె మీద ఆమెకే చిన్నతనంగా వుంది.

"ఏమిటి పొద్దున్నే ఇలా వచ్చావు?" అంది జగదాంబ.

సీత మళ్ళీ తనంతట తానే చెప్పాల్సి వచ్చింది విషయం.

"సరే! నువ్వెప్పుడూ శుభ్రంగావుండాలి. పిల్లవాడికి పాలిచ్చే ముందు ఒళ్ళు శుభ్రంగా కడుక్కోవాలి. ఇంకా........" జగదాంబ పెద్ద షరతుల లిస్టు ఏకరువుపెట్టింది.

సీత అలాగేనని తలూపింది. కాని తన శరీరంలో ఒక భాగం కోసి అమ్మేసినట్లూ తనమీద తనకే స్వతంత్రం లేనట్లూ అనిపించింది.

ఆ రోజునుంచి మరొకళ్ళ ఇళ్ళల్లోకి పనికి వెళ్ళినప్పుడు తప్ప సీతకు జగదాంబ ఎప్పుడూ తనచుట్టూ కాపలా తిరుగుతున్నట్లే వుండేది.

సీత వున్నంతసేపు సీతనూ, ఆమె పనికి వెళ్ళినప్పుడు ఆమె పసిబిడ్డనూ ఓ కంట కనిపెడుతూనే వుండేది జగదాంబ.


పాఠకులకు సంక్రాంతి కానుక

నవజ్యోతి పబ్లికేషన్స్
ఏలూరురోడ్
విజయవాడ-2

ప్రచురణకు ముందే పాఠకులకు 8/- రూ.ల లాభం
కళాప్రపూర్ణ పురిపండా అప్పలస్వామి
వచనంలో రాసిన నిత్యనూతనమైన రామాయణ,
భారత, భాగవత కావ్యాలను మా సంస్థ తొలిసారిగా
ఈ సంక్రాంతికి పాఠకులకు సరసమైన ధరల్లో-
అందిస్తోంది! ఒక్కొక్కటి 10 రూపాయలు!
ప్రచురణకు ముందే రూ.లు 25 పంపితే
జనవరి 10వ తేదీకల్లా పోస్టేజి మేమే
భరించి, ఈ మూడు వచన కావ్యాలని మీకందిస్తాం!
(అంటే ధరలు 30 రూ.లు, పోస్టేజీ 3 రూ.లు... వెరసి
8 రూ.లు లాభమన్న మాట!)





CHANDRA

"పోతపాలు పొయ్యడం నీకు అలవాటు లేదు. సరిగా కలుపుతావో, కలపవో! నేను చూపిస్తాను" అని మొదటి మూడు నాలుగు రోజులు తానే పాలు కలిపిచ్చి తనముందే సీతచేత పిల్లవాడికి పట్టించేది.

తన పిల్లవాడు తాగే పాలు కొంచెమే! మిగిలినవి ఏ రాత్రి పూటయినా ఎక్కడ సీత ఆమె పిల్లవాడికిస్తుందోనని బెంగ మొదలయిందామెకు

"పిల్లల తర్వాత పిల్లల్ని ఇలా కనేస్తే నీ సంపాదనతో ఏం పెంచుతావు! ఇకనైనా ఆపకూడదూ!" అంది ఓసారి సీతతో.

"ఆ పున నామాట యింటాడా అమ్మా! రాత్రి తాగొచ్చేక నేను నోరు విప్పడానికే లేదు కాదు" అంది సీత.

"మనిషి ఎదురుగా ఉంటే అలానే అనిపిస్తుంది. పోనీ నువ్వు పిల్లలతో మా వరండాలో పడుకో! చిన్న గదిలో ఇంతమంది పిల్లలతో ఏం బాధపడతారు!" అంది.

సీత కాబోసుననుకుని అలాగే పిల్లలతో వరండాలో పడుకొనేది. యాదగిరికి కోపం రాకుండా మరో సాకుతో వాడు పిలిచినప్పుడు వెళ్ళి వస్తూండేది రాత్రి కాలూ, చెయ్యీ సాచుకోడానికి మరి కొంత చోటు దొరికిందని సంతోషించింది.

వాడికి పాపం నీ దగ్గర పాలు తాగడం అలవాటు కాదూ! చంటి వెధవ పక్కనే ఉంటే తడిమి తడిమి ఏడుస్తాడు. దూరంగా పడుకోబెట్టు" అని సలహా ఇచ్చింది జగదాంబ. సీత సరేనని పసివాణ్ణి గోడకు దగ్గరగా పడుకోబెట్టి వాడికీ, తనకూ మధ్య పెద్దవాణ్ణి పడుకోబెట్టింది. కాని ఆ రాత్రి సీతకు మధ్యలో మెలకువ వచ్చింది. రొమ్ములు తీపుగా, పోటుగా వున్నాయి. దూరంగా నిద్రపోతున్న పసివాడి వైపు తలతిప్పి చూడగానే అప్రయత్నంగా కళ్ళల్లోంచి ఏకధారగా కన్నీళ్లు కారిపోయేయి.

నెల గడిచింది. సీత కొడుక్కి ఇంచుమించుగా నాలుగు పాల డబ్బాలయ్యేయి. జగదాంబ ఆ రోజు సీతను పిలిచి ముప్పై రూపాయ లిచ్చింది. సీతకు ఆ రోజు ఎక్కడలేని ఆనందం కలిగింది ఈ డబ్బు ఎలాగైనా యాదగిరి కంటబడకుండా పిల్లల కోసం దాచి వుంచాలి అని నిశ్చయించుకుంది.

జగదాంబ కొడుకు కొంచెం రూపు తేరుతున్నాడు ఆమె మనసులో బెంగ తొలగిపోయింది.

మర్నాడు సీత కొడుక్కి విరేచనాలు మొదలయ్యేయి. అవసరం వచ్చినప్పుడు పిల్లలకి వాడినట్టే ఏవో చెట్టు మందులూ



అరచేతిలో కథా? నవలా?

ఫొటో : ఆర్. నాగేశ్వరరావు, పటమట

మిగిలిన గంధాలూ నూరి వాడికి పట్టించింది సీత

ఓ రోజు తగ్గినట్లే తగ్గి మళ్ళీ తిరగపెట్టేయి. చివరకు డాక్టరు దగ్గరకు తీసుకెళ్ళక తప్పలేదు

మళ్ళీ నెల తిరిగి వచ్చేసరికి జగదాంబ ఇచ్చిన ముప్పై రూపాయలూ సీత డాక్టరుకు ఇయ్యవలసి వచ్చింది. పిల్లవాడు ఆర్భకంగా తయారవుతున్నాడు. రాత్రులు సరిగా నిద్రపోవటంలేదు.

ఓ రాత్రి వాడులేచి ఏడవడం మొదలుపెట్టేడు. ఎంత ఎత్తుకు తిప్పినా ఊరుకోలేదు. సరేనని తన షెడ్డులోకి వెళ్ళి పాలు కలుపుతూన్న సీతను చూసి అదేమిటని అడిగేడు యాదగిరి. పిల్లాడికి పాలు కలుపుతున్నానని చెప్పింది సీత.

"నీ దగ్గర పాలు!"

"పోట్లొస్తున్నాయి. ఇయ్యలేకపోతున్నాను."

"నీకేం రోగమొచ్చిందే! ఈ రోజే మొదటి బిడ్డను కన్నట్టు చెప్తున్నావు! నీ దగ్గర పాలు చీకబెట్టు!" అని అటుతిరిగి పడుకున్నాడు యాదగిరి.

పసివాడి కడుపులో నొప్పికి పాలు పోసి నొప్పి ఏం తగ్గించగలదు! వాడలాగే ఏడ్చి ఏడ్చి అలిసిపోయి పడుకున్నాడు. అవును తనకేదో రోగమొచ్చింది! పుట్టి పుణ్యానికి తన పిల్లవాణ్ణి పాడుచేసుకుంటూంది. పిల్లవాడి ఆరోగ్యాన్ని గురించి ఆలోచిస్తూ రాత్రి నిద్ర పోనేలేదు సీత.

"ఇంక ఈ రోజు నుంచి నీ పిల్లాడికి పాలియ్యలేనమ్మా! మా సంటోడికి ఏమీ పెయ్యి బాగలేదు." అంది సీత మర్నాడు జగదాంబతో.

"నిన్న సాయంత్రమే కదా పాలడబ్బా తీసుకెళ్ళేవు?" అంది జగదాంబ.

"డబ్బాపైసలు ఇచ్చేస్తాను."

"నువ్వు పాలిస్తున్నావని ఇంట్లో పాల డబ్బా లేకుండా చేసుకున్నాను. అసలే డబ్బాలు సరిగా సప్లై కావటంలేదట!"

"మీరే అమ్ముతుంటారు! మీకు లోటేమిటమ్మా!"

"అదేం కుదరదు. నెల నెలకు ఒప్పుకొని మధ్యలో మానేస్తే ఎలా?" జగదాంబ గొంతు పెంచింది.

"ఆడికి పేనం బాగోలేదు. నా మొగుడికి సెప్పకుండా ఒప్పుకున్నా! ఇంక నాచేతకాదు" అంది సీత.

"అయితే ఈ పాల డబ్బా బాకీ తీరిపోయేదాకా ఇయ్యి!" అంది జగదాంబ.

అప్పటికే ఇరుగు పొరుగులు ఇద్దరు మగవాళ్ళు బయటకొచ్చేరు.

సీత సిగ్గుతో అక్కడ నిలబడలేక వెళ్ళిపోయింది

ఆ వేళ నుంచే సీత కొడుక్కి గొట్టంతో పోసినట్లు విరేచనాలు మళ్ళీ మొదలయ్యాయి. ఎం తాగిస్తే అది వెళ్ళిపోతూంది సాయంత్రానికి వాడు డొక్కలు ఎగరెయ్యడం మొదలుపెట్టేడు. మగతగా కళ్లుమూసుకు పడుకుంటున్నాడు. చర్మం పొడారుతూన్నట్టుగా ఉంది.

సీతకు ఏదో భయం కలిగింది.

పిల్లవాణ్ణి కదిపి పలకరించింది. వాడు కళ్ళువిప్పి చూసేడు. బయటపడ్డఎముకలతో నీరసించిన ముఖంతో రెప్పవాల్చకుండా వాడు కళ్ళల్లోకి చూస్తూంటే సీత గుండె తరుక్కుపోయింది. నరాల్లో కరెంటు పాకినట్లుగు రొమ్ముల్లోంచి పాలు వాటంతట అవే వచ్చేసేయి.

సీత మరొక్కక్షణం కూడా ఆగలేక రొమ్ము వాడినోట్లో పెట్టి వాడిపోయినవాడి చిన్నారి ముఖమంతా ముద్దులతో నింపేసింది.

"సీతా!" జగదాంబ పిలుపు విని సీత వులిక్కిపడి తలెత్తింది.

"నాకు తెలుసు నీ దొంగ బుద్ధు లెక్కడికీ పోవని! అయిన పాలడబ్బాలూ, నెలకు ముప్పై రూపాయలూ, అడ్డమయిన తిండి నీకు పెట్టింది దీనికేనా తల్లీ! అవునులే! పుట్టుకతో వచ్చిన బుద్ధులు ఎక్కడికి పోతాయ్!...."

ఇళ్ళల్లోంచి జనం బయట కొచ్చేరు జగదాంబ కేకలువిని. సీత సిగ్గుతో చచ్చిపోయి పిల్లవాడి నోట్లోంచి రొమ్ము బయటకు లాగింది.